



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com


ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

బుధవారం 22 అక్టోబర్ 2025


# శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకం...

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
-విపత్కర సమయాల్లో మొదటగా స్పందించేది పోలీసులు మాత్రమే
-పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సహకారం మరువలేనిది
-ప్రతి పౌరులు పోలీసుల గొప్పతనం తెలుసుకోవాలి
-పోలీస్ అమరవీరుల సంస్కరణ దినం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్







**ఖమ్మం (సూర్య బ్యూరో):** శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం పోలీసు పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన పోలీసు అమరవీరులకు ప్రతి ఒక్కరూ నివాళులు అర్పించాలని అన్నారు.



ప్రభుత్వంలో ప్రతి శాఖ పని తీరులో పోలీస్ సహకారం సంపూర్ణంగా ఉంటుందని అన్నారు. భూ సేకరణ, ధాన్యం కొనుగోలు, ఎన్నికల నిర్వహణ, శాంతియుతంగా వేడుకలు జరగాలన్నా కూడా ప్రతి ఒక్క అంశంలో పోలీస్ సహకారం అవసరమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా యంత్రాంగానికి పోలీసులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని అన్నారు. దీపావళి, హెూళి, వినాయక నిమజ్జనం వంటి అనేక పండుగలు ప్రశాంతంగా జరుపు కోవడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతి పౌరులు పోలీసుల గొప్పతనం తెలుసుకోవాలని, కృతజ్ఞతగా ఉండాలని, కానిస్టేబుల్ నుంచి డీజీపి వరకు నేర నియంత్రణ కోసం పాటు పడుతారని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే 100 కు ఫోన్ చేస్తారని, అన్ని విపత్కర సమయాలలో మొదటగా స్పందించేది పోలీసులు మాత్రమే నని, 24 గంటల పాటు డ్యూటీలో ఉంటారని అన్నారు. పోలీసులు ప్రతిరోజు కుటుంబ సమయాన్ని త్యాగం చేస్తూ మన కోసం విధులు నిర్వహిస్తున్నారని, అటువంటి వారిపట్ల మనం నిరంతరం గౌరవ భావంతో ఉండాలని అన్నారు.

2లో

## కార్తీక మాసం పవిత్రం... పవిత్రం



5లో

## 15వ బెటాలియంలో పోలీసు అమరవీరులదినోత్సవం



6లో

## పేకాట స్థావరం పై పోలీస్‌లు దాడి



7లో

# సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమ ప్రాధాన్యం..

**ఖమ్మం (సూర్య బ్యూరో):**

సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమ ప్రాధాన్యం కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రివర్యులు, ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి కొండాపురం గ్రామంలో 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం, తల్లంపాడు గ్రామంలో ఖమ్మం సూర్యాపేట ఆర్ అండ్ బి రోడ్డు నుండి లక్ష్మీపురం వయా తల్లంపాడు నుండి తెల్దారుపల్లి వరకు 3 కోట్ల 58 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, 35 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రోడ్ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కొండాపురం గ్రామంలో 30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని, గడిచిన 21 నెలలో 64 లక్షల 50 వేల రూపాయలతో అంతర్గత సిసి రోడ్లు పూర్తి చేశామని అన్నారు. ఒక కొండాపూర్ గ్రామానికి 94 లక్షల 50 వేల రూపాయలు అంతర్గత రోడ్ల కోసం కేటాయించామని తెలిపారు. కొండాపూర్ నుంచి మోటాపురం



వరకు 7 కోట్ల 50 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం, పొన్నేకల్ నుంచి కొండాపురం వరకు 5 కోట్ల 20 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంజూరు చేసి టెండర్లు ఆహ్వానించామని త్వరలోనే ఈ పనులకు శంకుస్థాపన చేస్తామని మంత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 20 లక్షల రూపా యలతో, పెద్దకుంట చెరువు శాశ్వత మర మత్తు పనులను 25 లక్షల రూపాయలతో పూర్తి చేసామని

2లో



3లో

## పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం పాలన

## చెరువులో పర్యాటకుల సందడి



2లో

# శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకం...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మొదటిపేజీ తరువాయి



పోలీసు అమరవీరుల కుటుంబాలకు శాంతి చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 21 అక్టోబర్ 1959 లద్దాక్ ప్రాంతంలో దేశ సరిహద్దు కాపాడటంలో 10 మంది సిఆర్పిఎఫ్ సిబ్బంది చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి మరణించారని, విధులలో ఉండి మరణించిన పోలీసుల త్యాగాలకు చిహ్నంగా మనం నేడు పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంగా భారత దేశ వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడేందుకు 191 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి పోలీసు వ్యక్తికి దేశం మొదటి ప్రాధాన్యతగా ఉండాలని అన్నారు. డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ యూనిఫామ్ చాలా పెద్ద బాధ్యత అని, ప్రతి రోజు క్రిమినల్స్ తో పోరాటం, చాలా కష్టాలతో విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. సమాజంలో శాంతి భద్రతలు పకడ్బందీగా ఉండాలంటే పోలీసులు సరిగ్గా పని చేయాలని అన్నారు. పోలీసులు సరిగ్గా పనిచేస్తున్నారు అంటే దానికి వారి కుటుంబాలు కూడా చాలా సహకరిస్తున్నాయని తెలిపారు.

**అనంతరం విధి నిర్వహణలో అమరులైన**

పోలీసులకు స్మారక స్థూపం వద్ద జిల్లా కలెక్టర్, పోలీసు కమీషనర్, అటవీశాఖ అధికారి పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ పేరడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించగా, పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబీకులు పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత, అమర వీరుల స్మృత్యర్థం సాయుధ బలగాలు పెరేడ్, గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. అనంతరం పోలీసు ఆయుధాలు కిందకు దింపి వందనం చేసి రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి లు ప్రసాద రావు, రామానుజం, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమ ప్రాధాన్యం..

**-రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**-కొండాపూర్ గ్రామానికి 14 కోట్ల 11 లక్షల నిధులు మంజూరు**

**-ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి రోడ్డు నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి**

మొదటిపేజీ తరువాయి



అన్నారు. ఒక కొండా పూర్ గ్రామానికి గడిచిన 21 నెలల్లో 14 కోట్ల 11 లక్షల రూపాయలు అభివృద్ధి కోసం మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో పేద ప్రజలకు అందించిన హామీలను తూ.చ. తప్పకు ండా అమలు చేస్తున్నామని అన్నారు. పేద మహిళలకు ఇబ్బందులు తొలగించేందుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, ఉగాది నుంచి పేదలకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళల కు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, మొదటి ఏడాది 25 లక్షల రైతులకు 21 వేల కోట్ల రూపాయల 2 లక్షల రూపాయలు రుణ మాఫీ చేశామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. గత పది సంవత్సరాలలో పేదలకు ఇండ్లు కట్టించాలనే ఆలోచన గత పాలకులు చేయలేదని, మన ప్రభుత్వం మొదటి విడతలో 4.5 లక్షలు ఇండ్లు మంజూరు చేసిందని, కొండాపూర్ గ్రామంలో 30 ఇండ్లు వచ్చాయని, త్వరలో మిగిలిన అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, జిల్లా వ్యవసాయ అధికారి జి. పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో పర్యాటకుల సందడి...!

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**



మండలం లోని చెరువుమాధారం చెరువు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.చెరువు అలుగు పోస్తుండటంతో... మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు.చెరువు అలుగు వద్ద ఈత కొడుతూ సరదగా గడిపారు. సెల్ఫీలు దిగుతూ...ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషం గా గడిపారు. చెరువు వద్ద ఉన్న వనరులను వినియోగించి... మరింత అభివృద్ధి చేసి...పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహాకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి కోరారు.

# మాజీ సర్పంచ్ స్వాతి రమేష్ తల్లి కు మాతృవియోగం..

**- రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి....**

**- నివాళులర్పించిన కూసుమంచి మండల జర్నలిస్టులు.....**

**కూసుమంచి సూర్య మేజర్ న్యూస్:**





మండలంలోని జక్కేపల్లి ఏస్సీ కాలనీ మాజీ సర్పంచ్ రాయబారపు స్వాతి భర్త,జర్నలిస్ట్ రమేష్ కు మాతృవియోగం జరిగింది. రమేష్ తల్లి కొండమ్మ సోమవారం సాయంత్రం అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్ద తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న కూసుమంచి మండలం జర్నలిస్టు కమిటీ సభ్యులు కొండమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ ను ఓదార్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొండమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ప్రగాడ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. రమేష్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కందాళ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్ తల్లి కొండమ్మ మృతి విషయం తెలుసుకున్న పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, ఆయన సతీమణి విజయమ్మ హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి జక్కేపల్లి ఎస్సీ కాలనీకి వచ్చారు. కొండమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్ కుటుంబాన్ని పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సొసైటీ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా నాయకులు మల్లిడి వెంకన్న, మాజీ ఎంపీటీసీ కందుల వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ బానోత్ కిషన్, పడిశాల గోపి, సోషల్ మీడియా అధ్యక్షుడు వడ్యా బాలకృష్ణ, గ్రామశాఖ అధ్యక్షులు వడ్యా సైదులు, దాసరి వెంకన్న, నాయకులు చట్టు కనకయ్య, తంగేళ్ల లక్ష్మయ్య, కోడిరెక్క శివ, అలేటి ప్రసాద్, దార సత్యనారాయణ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మగూడెంలో అడపాల వెంకమ్మ జ్ఞాపకార్థం

**-దేవాలయంకు యాంపిల్ ప్లేయర్ అందజేత**



**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**

మండలం లోని అమ్మగూడెం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం కు గ్రామానికి చెందిన భక్తులు యాంపిల్ ప్లేయర్ ను అందించారు. మంగళవారం దేవాలయం లో జరిగిన కార్యక్రమంలో అడపాల వెంకమ్మ జ్ఞాపకార్థం దేవాలయం లో సుప్రభాతం వినిపించే అవసరమైన యాంపిల్ ప్లేయర్ ను కుటుంబ సభ్యులు అందించారు.ఈ కార్యక్రమంలో అడపాల రామారావు.అడపాల కోటయ్య,దేవాలయం కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం పాలన

**– కూసుమంచి మండల పర్యటనలో తెలంగాణ రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**





**కూసుమంచి సూర్య మేజర్ న్యూస్...**

.పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం పాలన చేస్తున్నదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి కూసుమంచి మండలంలోమంగళవారం పర్యటించి పలు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.... నేలపట్ల గ్రామంలో ముదిగొండ రోడ్డు నుంచి కొత్త చెరువు వరకు రూ. 2 కోట్ల 75 లక్షలతో బీటి రోడ్డు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. మునిగేపల్లి నుంచి వీరేంద్ర స్వామి దేవస్థానం వయా వెంకటాపురం మీదుగా 8 కిలోమీటర్ల మట్టి రోడ్డు రూ. 3 కోట్లతో మంజూరు చేశామని, త్వరలోనే ఆ పనులకు శంకుస్థాపన చేస్తామని అన్నారు.నేలపట్ల గ్రామంలో రూ. 34 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించామని, మరో 15 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అంగన్వాడి భవనానికి రూ. 5 లక్షలు, త్రాగునీటి మరమ్మతు పనులకు రెండు లక్షల రూపాయలు, ప్రజా ప్రభుత్వంలో గడిచిన 22 నెలల కాలంలో మొత్తంగా రూ. 6 కోట్ల 31 లక్షల రూపాయలు నేలపట్ల గ్రామ అభివృద్ధికి మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ధర్మతండ గ్రామంలో రూ. 3 కోట్ల 75 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. లోక్య తండా నుంచి ధర్మ తండా వరకు కోటి 26 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన రోడ్డు ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, వర్షాకాలం లోపు ఆ రోడ్డు శంకుస్థాపన చేస్తామని, రాబోయే వర్షాకాలంలోపు ఈ రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని అన్నారు. గత 22 నెలల కాలంలో ప్రజల ఆశీర్వాదంతో ధర్మతండా గ్రామానికి రూ. 46 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించుకున్నామని అన్నారు. రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించామని, మొత్తం ధర్మతండా గ్రామానికి రూ. 5 కోట్ల 95 లక్షల నిధులు అభివృద్ధి కోసం మంజూరు చేయడం జరిగిందని అన్నారు.పేదల ఆశీర్వాదంతో వచ్చిన ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్తు, ఉగాది నుంచి రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం, నూతనంగా పేద కుటుంబాలకు రేషన్ కార్డుల జారి, పాత రేషన్ కార్డులలో నూతన సభ్యుల పేర్ల నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.రైతును రాజు చేయడంలో భాగంగా మొదటి ఏడాదిలో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల 2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని, ప్రస్తుత సీజన్లో కూడా బోనస్ ఇవ్వడానికి క్యాబినెట్ నిర్ణయించిందని, రాబోయే వారం నుంచి పది రోజులలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు.పేద ప్రజలకు భరోసా, ధైర్యం అందించేలా ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తుందని, పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫాలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మన నేలపట్ల గ్రామంలో మొదటి విడత క్రింద 18 ఇండ్లు మంజూరు చేశామని, పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామని అన్నారు. పేదల పక్షపాతిగా ఉన్న ప్రజా ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులను ఆదుకోవాలి...

**-ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలి....**

**-సీపీఎం,ఏఐకేఎస్ డిమాండ్**



**ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్ :**

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్,ఏఐకేఎస్ పాలేరు డివిజన్ నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఎం.వెంకటాయ పాలెం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ...రైతులు దిగుబడి రాక ఇబ్బందులు పడుతుంటే ప్రకృతి రైతుపై కక్ష కట్టినట్లు పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాలు పడటంతో పంట మొత్తం దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు.ఎకరాకు 50 వేల రూపాయలు పెట్టుబడి పెడితే కనీసం 20 వేల రూపాయల పంట కూడా చేతికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఎంవీ పాలెం గ్రామానికి చెందిన వేమన వెంకట్రాములు 16 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాని ఎకరాకు రెండు క్వింటాల పంట మాత్రమే పండిందని,క్వింటా పత్తి ప్రభుత్వం రూ.7500 కు కొంటున్నారని,తేమ ఉందని రూ.3500 కే అడుగుతున్నారని ఎకరాకు 50 వేల చొప్పున,ఎనిమిది లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టానని బృందానికి తీవ్ర ఆవేదనతో తెలిపారు.రైతు సంఘం డివిజన్ నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం రైతులను దోపిడీ చేసే పథకం గా మారిందని విమర్శించారు.బీమా పథకం నుండి ప్రభుత్వం తప్పుకోవడంతో ,ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వెళ్లడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉరడీ సుదర్శన్ రెడ్డి,చావా నాగేశ్వరరావు,మద్ది వెంకట రెడ్డి,ఆయా సంఘాల నాయకులు సంద్ర ప్రసాద్,వడ్లమూడి నాగేశ్వరరావు,పాపిట్ల సత్యనారాయణ,ఏపూరి వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మలా లాలించేదే అంగన్వాడీ కేంద్రం...



**కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్)**

చిన్న పిల్లలను అమ్మ లా లాలించి చూసు కునే అంత మంచి అవకాశం అందరికి రాదని అంగన్వాడీ కేంద్రంలో పనిచేసే టీచర్లకు,ఆయలకు మాత్రమే వస్తుందని స్కిల్ డెవలప్మెంట్ ట్రైనర్ మాధవిలత రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.భగవాన్ శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చేరుకొని శ్రీ సత్యసాయి సేవా సంస్థ సభ్యులు చేస్తున్న సేవ కార్యక్రమాలు గురించి వివరించారు.ఈ సందర్భంగా మాధవి లత రెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలు సందర్భంగా ఖమ్మంలో పలు సేవా కార్యక్రమంలో నిర్వహించామని సంస్థ చేస్తున్న సేవకు ముగ్ధులై అట్టి సేవా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడి టీచర్లను అభినందిస్తున్నట్లు తెలిపారు.అన్నవరం గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్ జర్పుల పుష్పవతి సేవా సంస్థలో చేసిన సేవలను గుర్తించి ఆమెను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. అంగన్వాడి కేంద్రంలో చిన్న పిల్లల యొక్క మంచి చెడులు,ఆలనా పాలన చూసుకుంటూ పిల్లలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటూ ఆమెకు కుదిరిన సమయంలో సేవా కార్యక్రమంలో పాల్గొనటం అభినందనీయమని అర్బన్ సిడిపిఒ వీరభద్రమ్మ డాక్టర్ ఉమా కుమారి అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమ%శీ%లో సింధు,శిల్ప గ్రామస్తులు పాల్గొని అంగన్వాడి టీచర్ పుష్పవతిని శాలువాలతో శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు.

# నల్లచెరువు అలుగు మరమ్మతులకు నిధులు కేటాయించండి...

**-భట్టి విక్రమార్కని కలిసి చింతకాని గ్రామ సమస్యలను తెలియపరిచిన కిలారి మనోహర్....**



**చింతకాని సూర్య మేజర్ న్యూస్:**

మంగళవారం ప్రగతి భవన్ లో చింతకాని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కిలారు మనోహర్ బాబు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు విద్యుత్ శాఖ మరియు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ని మర్యాద పూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే చింతకాని మండల కేంద్రంలో ఉన్న సమస్యల పరిష్కారానికి మల్లు భట్టి విక్రమార్క కు తెలియ జేశారు అలాగే చింతకాని గ్రామంలో కొన్ని చోట్ల విద్యుత్ సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు అలాగే చింతకాని నల్ల చెరువు పెద్ద తూము మరమత్తులు,కాలువ పూడిక పనులు చేపట్టాలని కోరారు రైతుల ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని కోరారు ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండల కేంద్ర అభివృద్ధికి కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు.

# దట్టమైన పొదలు చెట్లు ముళ్ళ కంపలతో మూసుకుపోయిన ఆర్ అండ్ బి రహదారి

**-తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, ప్రజలు, రైతులు**

**-పట్టించుకోని అధికారులు**

**- దాతృత్వం చాటుకుని సొంత ఖర్చులతో రహదారిని బాగు చేసిన గుగులోతు రవి!**







**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్.**

అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు...ఈ ఆర్ అండ్ బి రహదారి గుండా ప్రయాణం అంటేనే రైతులు, ప్రజలు, ప్రయాణికులు... తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు... కానీ వారి ఇబ్బందులను చూడలేక ఓ యువకుడు నడుం బిగించి ముందుకు వచ్చి తన సొంత ఖర్చులతో రహదాన్ని శుభ్రం చేయించాడు. దీంతో ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు... వివరాలు ఇలా ఉన్నాయి డోర్నకల్ నుండి పండితాపురం ( వయా బండిపాడు) ఆర్ అండ్ బి రహదారి కి ఇరువైపులా చెత్త చెదారం, చెట్లు ముళ్ళపోదలు దట్టంగా అల్లుకొని ఉండటంతో ఈ రహదారి గుండా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.రాత్రి వేళలో వచ్చే వాహనాలు కనపడకపోవడంతో ఎదురు ఎదురుగా ఢీకొని పలు ప్రమాదాలు జరిగాయి. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.ఇప్పటికి ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడి ప్రజలు, రైతులు, ప్రయాణికులు ఈ రహదారి విషయాన్ని సంబంధిత ఆర్ అండ్ బి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన వారు స్పందించకపోవడంతో. బండిపాడు గ్రామానికి చెందిన యువకుడు ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గుగులోతు రవి తన సొంత ఖర్చులతో రహదారి వెంట ఉన్న చెత్త, చెదారం, చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలను మంగళవారం తొలగించారు. దీంతో పలువురు రైతులు, ప్రయాణికులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.రవి దాతృత్వాన్ని పలువురు గ్రామస్తులు, రైతులు, ప్రయాణికులు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నిరంతరం ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలనే సంకల్పంతో ముందు సాగుతున్నామని తెలిపారు. రానున్న కాలంలో రుక్కీ తండ గ్రామ పంచాయతీ లో ఉన్న గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆ ధ్యేయంతో ముందుకు సాగుతానని వెల్లడించారు.

# సిపిఐ 100 ఏండ్ల వేడుకను విజయవంతం చేయాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు**

**- రూ 388,000 వేలు విరాళం అందజేసిన కామ్రేడ్స్**



**ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్**

: సిపిఐ 100 సంవత్సరాల వేడుక విజయవంతమే లక్ష్యంగా ఊరు...వాడ... గడప..గడపనా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాపురంలో పాత పంచాయతీలోని వరంగల్ క్రాస్ రోడ్, సత్యనారాయణపురం, తాళ్ళేసి తండా శాఖల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ధరావత్ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ... ఏ పార్టీకి లేని వందేళ్ళ చరిత్ర కలిగిన ఒకే ఒక్క పార్టీ సిపిఐ అన్నారు. అటువంటి పార్టీకి సభ్యుడిగా కొనసాగటం కమ్యూనిస్టుగా గర్వపడాల్సిన విషయం అన్నారు. ఈ వేడుక ఖమ్మం నగరంలో జరుపుకునే అవకాశం రావడం మనందరి అదృష్టం అన్నారు. ఈ ప్రస్థానంలో పోరాటాల ద్వారా సాధించిన హక్కులు చట్టాలను ప్రజలకు వివరించాలన్నారు. 35 దేశాల కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. కావున ప్రపంచం మొత్తం మన వైపే చూస్తుందన్నారు. ఈ చరిత్రత్మక ఘట్టం చరిత్రలో నిలిచిపోబోతుందన్నారు. దీనికి ఎంతో విలువైన 60రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, కుటుంబాలతో సహా కామ్రేడ్స్ కదం తొక్కాలన్నారు. అలాగే విజయవంతనికై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం రూ . 3 లక్షల 88 వేల రూపాయలను విరాళంగా కామ్రేడ్స్ జిల్లా పార్టీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మెడకంటి చిన్న వెంకటరెడ్డి, ఐ ఏ ఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, బానోతు రామకోటి, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి ,మండల సమితి సభ్యులు మామిడి శంకర్ రెడ్డి, చిదుముల బాబు రెడ్డి, దొంతగాని వెంకన్న, మేళ్లచెరువు వీరబాబు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఘనపరపు ఉపేందర్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మి దకంటి అభిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 లో ప్రతిభ కనబరిచిన వి.వి విద్యాలయం పూర్వపు విద్యార్థులకు సన్మానం

**- డీ ఎస్ పి గా గోలి హిమ వర్షిని**

**- మెడికల్ విభాగంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తాటి ప్రమోద్ సాయి.**

**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:**



పట్టణ పరిధిలోని వి.వి విద్యాలయం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రాథమిక విద్యను అభ్యసించి 2025 గ్రూప్ 1 ఫలితాలలో ప్రతిభ కనబరిచి డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ (డి.ఎస్.పి)గా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన గోలి హిమ వర్షిని,మెడికల్ విభాగంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా ఉద్యోగం సాధించిన తాటి ప్రమోద్ సాయిని పాఠశాల కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్ రెడ్డి,పాఠశాల సిబ్బంది మంగళవారం నాడు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా భగవాన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల చదువులో ప్రాథమిక విద్య పునాది వంటిదని ఆ పునాదిపై భవిష్యత్తును నిర్మించుకున్న విద్యార్థులు ఇలా ఉన్నతంగా ఎదుగుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోరిగట్ల వంశీకృష్ణ సన్మాన గ్రహీతల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి విద్యుత్ ఇన్సూరెన్స్ చెక్కు అందించిన మంత్రి పొంగులేటి.....



**కూసుమంచి సూర్యా మేజర్ న్యూస్....**

మండలంలోని పెరక సింగారం గ్రామంలో గత కొన్ని సంవత్సరాల క్రితం కొండలరావు అను వ్యక్తి విద్యుత్ షాక్ తో మృతి చెందారు. కాగా అట్టి విషయాన్ని స్థానిక మాజీ ఎంపీపీ జుకూరి గోపాలరావు విద్యుత్ అధికారులకు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకువెళ్లి ఇన్సూరెన్స్ ఐదు లక్షల చెక్కును మంజూరు చేయించారు. మరణించిన కొండలరావు భార్య అయిన దేవల దుర్గ కు ప్రభుత్వం ద్వారా మంజూరైన విద్యుత్ ఇన్సూరెన్స్ చెక్కును తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతులమీదుగా చెక్కును కూసుమంచి క్యాంపు కార్యాలయం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, ఏ డి ఏ కోక్య నాయక్, మండల నాయకులు చాట్ల పరుశురాం నాయకులు బజ్జూరి వెంకటరెడ్డి,, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏడుకొండలు, లక్ష్మీనారాయణ,సురేష్, వెంకటస్వామి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తి,పరిసరాల పరిశుభ్రతలో మాకు మేమే సాటి

**- ఎస్.వి.ఆర్ ప్రహ్లాద్.**

**- 19వ రోజు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న జే.వి.ఆర్ గని అధికారులు.**



**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:**

నిత్యం ఉన్నత అధికారులతో సమావేశాలు,బొగ్గు వెలికితీత కార్మికులతో సమీక్షలు,గని పరిశీలనా వంటి కార్యక్రమాలలో బిజీగా ఉండే జలగం వెంగళరావు ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వి ప్రహ్లాద్ కార్యాలయ పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించారు.19వ రోజు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో పాల్గొని తాను పనిచేస్తూ తన సిబ్బందితో పనిచేయిస్తూ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.బొగ్గు ఉత్పత్తి సాధించడంలో పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దడంలో తమ సిబ్బంది శక్తి వంచన లేకుండా శ్రమిస్తారని ఈ విషయంలో వారికి వారే సాటి అని ప్రశంసించారు.పరిసరాల పరిశుభ్రత ఒక్కరోజు కార్యక్రమం కాదని సిబ్బంది విధులు నిర్వహించే ప్రాంతంలో కార్యాలయాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.ఎం బి.రాజేశ్వరరావు, జి.కళ్యాణ్ రామ్,ప్రాజెక్ట్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు,సంక్షేమ అధికారి దేవదాసు,అధికారులు, దినసరి కూలీలు,సెక్యూరిటీ సిబ్బంది,శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుండి కామేపల్లిలో కార్తీక మాస ఉత్సవాలు



**కామేపల్లి సూర్య మేజర్ న్యూస్.**

శివునికి అత్యంత ప్రీతి పాత్రమైనకార్తీక మాస ఉత్సవాలుఈనెల 22 నుండి నవంబర్ 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు గొట్టిపర్తి శివాజీ తెలిపారు స్థానిక బాలత్రిపుర సుందరి ఇష్టకామేశ్వరి స్వామి దేవాలయం ప్రాంగణంలోని గురు మందిరంలో కార్తీక మాసం పురస్కరించుకొని నిత్యం శివునికి రుద్రాభిషేకం అష్టోత్తర శతనామ పూజలు జరుగుతాయని అదేవిధంగా విశేష దినములైన నాగుల చవితి సోమవారాలు ఏకాదశి కార్తీక పౌర్ణమి మాస శివరాత్రి వంటి ప్రత్యేక రోజులలో విశేష పూజలు నిర్వహిస్తారని ఈ సందర్భంగా శివాభిషేకం చేయించుకోదలచినవారు కమిటీ వారిని సంప్రదించాలని అదేవిధంగా శివారాధన చేసి దేవునికి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

సూర్య
బుధవారం 22 అక్టోబర్ 2025

## సిపిఐ పార్టీ వందేళ్ళపండును జయప్రదం చేయండి...

**-దూసరి గోపాలరావు....**



**చింతకాని సూర్య మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ పండగ (శత జయంతి ఉత్సవాల ముగింపు) సందర్భంగా ఖమ్మంలో జరిగే మహా ప్రదర్శిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని చింతకాని మండలం సిపిఐ పార్టీ కార్యదర్శి దూసరి గోపాల్ రావు అన్నారు.మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వాల్ రైటింగ్ రాయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి సిపిఐ జిల్లా కార్యవర్గం సభ్యులు ఏపూరి రవీంద్రబాబు పదిలం వెంకటనరసయ్య గ్రామ శాఖ కార్యదర్శి చాట్ల రమేష్ షేక్ జాన్ కొమ్ము ఫిలిప్స్ ఉన్నారు

## పత్తి పంటలను పరిశీలించిన సహాయ వ్యవసాయ సంచాలకులు



**బోనకల్, సూర్య మేజర్ న్యూస్):** మండల పరిధిలోని రాపల్లి గ్రామంలో పత్తి పంటలను మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ చంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులందరూ పత్తిని సీసిఐ కేంద్రాలలో అమ్మకం చేపట్టాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కపాస్ కిసాన్ అనే మొబైల్ యాప్ లో నమోదు చేసుకోవాలన్నారు. యాప్ లో రైతు యొక్క ఫోన్ నంబర్ తో లాగిన్ అయ్యి స్లాట్ బుక్ చేసుకోని, జిన్నింగ్ మిల్లులకు నిర్దేశించిన తేదీకి పత్తిని తీసుకువెళ్లి విక్రయించుకోవాలని తెలిపారు. పత్తి పంట వేసుకున్న రైతులందరూ ఆయా గ్రామాల క్లస్టర్ ఏఈవోలు దగ్గరికి వెళ్లి పంట నమోదు వెబ్సైట్ లో మీ యొక్క మైబైల్ నంబర్ సరిగ్గా వుందో లేదో చూసుకొని లేని యెడల మీ మొబైల్ నంబర్ సరి చేసుకోవాలని సూచించారు. మొబైల్ నంబర్ సరిగ్గా లేకపోతే పత్తి సీసీఐ లో అమ్ముకోవడం కుదరదని పత్తి రైతులందరూ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గరికి వెళ్ళి మొబైల్ నంబర్ సరిచేసుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ హుస్సేన్ సాహెబ్, బ్రాహ్మణపల్లి సహకార సంఘం అధ్యక్షులు ఏనుగు నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక లారీ పట్టివేత



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని వీఎం బంజర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం వి ఎం బంజర్ రింగ్ సెంటర్లో ఎస్ ఐ కే వెంకటేష్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలలో ఒక లారీలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి ఇసుక లోడుతో ఉన్న లారీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఏపీకి చెందిన కొవ్వూరు నుండి హైదరాబాద్ కు 30 టన్నుల ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్, లారీ యజమానిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# కార్తీక మాసం పవిత్రం.... పవిత్రం.....

**మధిర, సూర్య మేజర్ న్యూస్.**



దీపావళి పండుగను అందరూ ఆనందంగా జరుపుకొన్న తర్వాత ఆధ్యాత్మికత ఉట్టిపడే కార్తీక మాసంలోకి అడుగు పెడతాం. తెలుగు పంచాంగం ప్రకారం ఒక ఏడాదిలో వచ్చే అన్ని మాసాలలో కెల్లా కార్తిక మాసం అత్యంత పవిత్రమైనది. ఇటు శివునికి, అటు విష్ణువుకు కూడా ప్రీతికరమైన కార్తిక మాసం ఆధ్యాత్మిక సాధకులకు మోక్ష మార్గం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అసలు కార్తిక మాసానికి ఇంతటి పవిత్రత చేకూరడం వెనుక ఉన్న రహస్యమేమిటి? కార్తికమాస విశిష్టత ఏమిటి అనే విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

### కార్తీక మాసమని పేరు ఇందుకే!

శరదృతువులో వచ్చే కార్తిక మాసంలో పున్నమి రోజు చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు కాబట్టి ఈ మాసానికి కార్తిక మాసమని పేరు వచ్చింది. తెలుగు మాసాల్లో తొమ్మిదో మాసమైన కార్తిక మాసం మాసాల్లో కెల్లా ఉత్తమమైనది.

### కార్తీకానికి సమానమైన మాసం లేదు!



స్కంద పురాణం ప్రకారం కార్తిక మాసానికి సమానమైన మాసం, శ్రీ మహా విష్ణువుకు సమానమైన దేవుడు, గంగతో సమానమైన తీర్థము, వేదాన్ని మించిన శాస్త్రం లేదని తెలుస్తోంది.

### హరిహరులకు ప్రీతికరం కార్తీకం

హిందూ సంప్రదాయం ప్రకారం, సనాతన ధర్మాన్ని అనుసరించి ఒక ఏడాదిని రెండు ఆయనములుగా విభజిస్తారు. అందులో మొదటిది ఉత్తరాయణం అయితే రెండోది దక్షిణాయనం. ఉత్తరాయణంలో మాఘ మాసానికి ఎంతటి విశిష్టత ఉందో, దక్షిణాయనంలో కార్తిక మాసానికి అంతే విశిష్టత ఉంది. ఈ పవిత్ర కార్తిక మాసం హరిహరులకు ప్రీతికరమైనది. కార్తిక మాసంలో చేసే శివారాధనకు విశేష పుణ్యఫలం లభిస్తుందని కార్తీక పురాణం చెబుతోంది. ఈ సందర్భంగా కార్తీక మాసంలో హరిహరులు అనుగ్రహం కోసం ఏమి చేయాలో చూద్దాం.

### నదీస్నానం

కార్తీక మాసంలో నదీ స్నానానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. రుషులు, మహర్షులు, సిద్ధులు కార్తిక మాసం నెల రోజులు పవిత్ర నదీ తీరాల్లో సంచరిస్తూ ఈ మాసమంతా కార్తిక స్నానం ఆచరిస్తుంటారు. కార్తిక మాసంలో గంగ, యమునా, గోదావరి, కావేరి, కృష్ణ వంటి పుణ్య నదుల్లోనే కాకుండా చెరువులు, నీటికుంటలు, సముద్రాల్లో కూడా స్నానమాచరించవచ్చునని స్కంద పురాణాంతర్గతమైన కార్తిక పురాణంలో వివరించి ఉంది.

### దీపారాధన

కార్తీక మాసంలో శివాలయంలో దీపాలు వెలిగించడం వల్ల పాపాలు తొలగి పుణ్యాలు చేకూరుతాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసంలో తెలిసి కానీ తెలియక కానీ చివరకు చెడు తలపుతో అయినా సరే దీపం వెలిగిస్తే, ఆ ఫలం లెక్క కట్టలేనిది. భక్తి శ్రద్ధలతో శివాలయంలో చేసే దీపారాధన కూడా ఎంతో పుణ్య ఫలాన్ని ఇస్తుంది. కార్తీక మాసంలో దీపారాధన ఉన్న ప్రాధాన్యత గురించి కార్తీక పురాణంలో విపులంగా వివరించి ఉంది.

### దానాలు

సంపాదించినా ధనానికి కానీ పుణ్యానికి కానీ దానంతోనే సార్ధకత చేకూరుతుందని స్కంద పురాణం వివరిస్తోంది. కార్తీక మాసంలో చేసే దానాలకు మాములు కన్నా కోటిరెట్ల అధిక ఫలం లభిస్తుంది. ఈ మాసంలో దీపదానం, సాలగ్రామ దానం, అన్నదానం, వస్త్రదానం, గోదానం, భూదానం వంటి దానాలతో ఇటు ఇహలోకంలో, అటు పర లోకంలో కూడా తరించవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కార్తీక మాసంలో కన్యాదానం చేస్తే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు తరిస్తాయని, గతించిన పూర్వీకులకు సద్గతులు కలుగుతాయని కార్తిక పురాణం చెబుతోంది.

# వైరాలో వెలుగుల సంబురం

**-అంబరాన్నంటిన దీపావళి వేడుకలు**

**-లక్ష్మీదేవి పూజలు వ్రతాలు,-ఆలయాల్లో పూజలు**

**వైరా సూర్య ఆర్సి ః**



వైరా పట్టణం ఊరు వాడ వెలుగుల పండుగ దీపావళి పర్వదినాన్ని సోమవారం ఇంటిల్లిపాది వెలుగులు నింపాయి అమావాస్య తిది సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి మొదలుకొని మంగళవారం సాయంత్రం నాలుగు గంటల 19 నిమిషాల వరకు ఉండటంతో దివ్వెల సంబురాన్ని రెండు రోజులు పాటు జరుపుకున్నారు సోమవారం లక్ష్మీదేవి పూజలు వ్రతాలు నోములు నిర్వహించారు దివ్వెల వెలుగుల సంబరాల పర్వదినం దీపావళి అందరికీ నూతన కాంతులను అందించింది. అజ్ఞాన చీకట్లను తొలగించి విజ్ఞాన వెలుగులు నింపి సందేశాన్ని అందించింది చెడుపై మంచి ఘన విజయం సాధిస్తుందని దీపావళి ఇతివృత్యాలు తెలియజేస్తున్నాయి ఆది కాలంలో నరకాసురుని సత్యభామ బాహుబ లం తో సంహరించి లోకాలకు ఆనందాన్ని రోజులు గుర్తు చేసుకుంటూ దీపాలతో సంబరాలు జరుపుకున్నారు. ఇంటి అంతా వెలుగులు నింపుతున్న దీపాలు రోజున రాతకాలమే పుణ్య స్థానం చేసి పట్టు మహిళల పట్టు చీరలు ధరించి తీరక పూలతో గృహాలను మామిడి అరటి ఆకులతో అలంకరించారు ఈ పర్వదినం లక్ష్మీదేవికి ప్రీతి పాత్రమైన రోజు అయినందువలన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు పీటపై అవ వాహన చేసి ధూప దీప నైవేద్యాలతో విశేష పూజలు నిర్వహించారు తాము నూతనంగా కొన్న బంగారు ఆభరణాలు పీఠంపై ఉంచి పూజలు నిర్వహించి అనంతరం మహిళలు ధరించారు అమ్మవారు తమను సిరి సంపదలతో అఖండ సౌభా గ్యాన్ని ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు వేడుకున్నారు అనంతరం ఇంటిల్లిపాది విందు భోజనాలతో స్వీట్ లతో ఆనందంగా పంచు కున్నారు తనకిష్టమైన మిఠాయిలను ఆరగించారు.

సాయంత్రం వేళ సంధ్యా సమయంలో ప్రతి ఇంటి దీపాలతో వెలిగించారు తమ హృదయాల్లో వెలగాల్సిన విజ్ఞానజ్యోతికి చిహ్నంగా ప్రమిదల్లో నువ్వుల నూనె పోసి ఒత్తిని వెలిగించి అమావాస్య చీకటిని పాల ద్రోలారు వాడ వాడలా ఇళ్ళ ముందు ప్రతి గుమ్మం ముందు దీపాల వరసతో ప్రతి ఇంటా వెలుగులు నిండాయి దీపాల తోరణాలతో ఊరు వాడ నూతన శోభను సంతరించుకుంది. భక్తులు ఆలయాలకు వెళ్లి ఆకాశదీపం జ్వాలా తోరణం దర్శించుకుని పునీతులయ్యారు చిన్న పెద్ద తారతమ్యం లేకుండా వైరా గాంధీచౌక్ వరసిద్ధి వినాయక మందిరం సాయిబాబా మందిరం బ్రాహ్మణపల్లి శాంతినగర్ వేద పాఠశాల నందు వార్డులలో అపార్ట్మెంట్లలో తమ తమ గృహాల ముందు కాకర వత్తులు వెన్నెల మడుగులు చిచ్చుబుట్లు తాటాకు బాంబులు లక్ష్మీ బాంబులు మిరపకాయ బాంబులు రాకెట్టు తారాజువ్వలు భూచక్రాలు ఉల్లిగడ్డ బాంబులు కుండ బాంబులు తదితర బాణాసంచా కాలుస్తూ దీపావళి సంబరాలను అంబరాన్ని తాకేలా జరుపుతున్నారు

# కార్తీక మాసం పరమ పవిత్రం

## -నేటి నుండే కార్తీక మాసం ప్రారంభం





**వైరా సూర్య ఆర్ సి ః-**

కార్తీక మాసం విశిష్టత కార్తీక మాసం అన్ని మాసాలలో కెల్లా అత్యంత పవిత్రమైన మాసం కార్తీక మాసం తెలుగు సంవత్సరంలో వచ్చే ఎనిమిదో మాసం ఇది చంద్రుడి కృత్రిక నక్షత్రం ఉండటం ఈ ఈ మాసానికి కార్తీక మాసం అనే పేరు వచ్చింది. పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన మాసం ఇది ఈ నెల రోజులు శివరాధన చేస్తూ కార్తీక సోమవారాలు ఉపవాసాలు ఆచరిస్తూ ఆ బోలా శంకరుడి అనుగ్రహం పొందడం కోసం ప్రయత్నిస్తారు ఏడాది కార్తీక మాసం ఈరోజునుండ ప్రారంభమవుతుంది అత్యంత మహామాన్వితమైన మాసం ఇది పూజలు వ్రతాలు ఉపవాసాలు వనభోజనాలతో ఈ మాసం మొత్తం భక్తి పారవశంతో మునిగిపోతుంది ఈ మాసంలో శివలింగానికి బిల్వదళాలతో అర్చన చేయడం వల్ల సర్వలోక ప్రాప్తి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి కూడా చాలా విశిష్టత ఉంటుంది ఈరోజు పవిత్ర నది స్థానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు పున్నమి వెలుగుల్లో కార్తీక్ దీపాలను వెలిగిస్తారు వీటిని పారే నీటిలో లేదా చెరువుల్లో విడిచిపెడతారుఇక సోమవారాలు అత్యంత విశిష్టమైనదిగాభావిస్తారు శివాలయానికి వెళ్లి పూజలు చేసి వారికి దోషాలను తొలగిపోతాయని ఈతి బాధలుఉండవనినమ్ముతారు శివారాధనలుప్రదోషకాలంలోచేసేశివారాధనకువిశేషమైనప్రాముఖ్యత ఉంటుంది అలాగే కార్తీక మాసం లో చేసే దీపారాధన చాలా మహిమ కలుగుతుంది సాయంత్రం వేళ భక్తులు గుడికి వెళ్లి దీపారాధన చేస్తారు ఇలా చేయడం వల్ల జన్మజన్మల పాపాలు తొలగిపోతాయి. కొంత మంది కార్తిక మాసంలో సోమవారం నాడు 365 ఒత్తులతో దీపం వెలిగించి శివుని దర్శించుకుంటారు.

### మాంసాహార నిషేధం

కార్తీక మాసంలో భక్తులు మాంసాహారానికి దూరంగా ఉంటారు వెల్లుల్లి ఉంటే వాటిని కూడా దూరం పెడతారు ఈ మాసం మొత్తం కేవలం పూజలు వ్రతాలు నోములు జరుపుకునేందుకు విశిష్టమైనది. కార్తీక పురాణాలు చదివిన వారికి విన్నవారికి ఏడేడు జన్మల పుణ్యం దక్కుతుంది వివాహ స్త్రీలకు వైవిధ్యం రాదని నమ్ముతారు.

### ఉసిరి పూజ

కార్తీక మాసంలో తప్పనిసరిగా ఉసిరి చెట్టుకు పూజ చేస్తారు ఉసిరి లక్ష్మీదేవికి ఇష్టమైన నివాసంగా పేర్కొంటారు అందుకే ఉసిరి చెట్టు కింద భోజనం చేయడం చేస్తారు అలాగే ఉసిరి చెట్టు కింద దీపం వెలిగిస్తారు అయ్యప్ప దీక్ష కార్తీకమాసం తొలి రోజు నుంచి అయ్యప్ప దీక్షలు ప్రారంభమవుతాయి 41 రోజులపాటు భక్తులు మండల పూజా దీక్ష చేపడతారు ఈ మాసంలో భక్తులు కఠినమైన నియమాలు ఆచరిస్తూ ఉపవాసం పాటిస్తారు నలుపు రంగు దుస్తులు ధరించి భక్తులు నిత్యం పూజలు భజనలు పాల్గొంటారు మకర సంక్రాంతి రోజు మకర జ్యోతి దర్శనం చేసుకుని భక్తులు పునీతులు అవుతారు.

# పేద విద్యార్థుల "విద్యకు" వేమూరి సత్యనారాయణ చేయూత

## -కొత్తపల్లి ధనూష్ కుమార్ కు 70 వేల ల్యాప్ టాప్ అందజేత

## -పదవ తరగతి విద్యార్థులకు ఆర్థిక సహకారం





**వైరా సూర్య ఆర్సి :-**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వేమూరి సత్యనారాయణ గత పది సంవత్సరాలుగా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. వైరా మండలం సిరిపురం (కెజి) గ్రామం వాస్తవ్యులు, వైరా పట్టణ నివాసి రోటైర్డ్ అధ్యాపకులు వేమూరి సత్యనారాయణ ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఎంబిబిఎస్, బిటెక్ చదువుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన పలువురు ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఇతోధికంగా ఆర్థిక సహాయం చేస్తూ ఒకవైపు ప్రభుత్వ విద్యకు చేయూత అందిస్తూ, మరోవైపు ఉన్నత విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్నారు. మంగళవారం సిరిపురం (కెజి) జెడ్.పి.హెచ్ఎస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు వేమూరి సత్యనారాయణ, స్వరూపారాణి దంపతుల కుమారుడు ప్రముఖ ఎన్ఆర్ఐ వేమూరి సుధీర్ సౌజన్యంతో సిరిపురం(కెజి) గ్రామానికి చెందిన బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి కొత్తపల్లి ధనూష్ కుమార్ కు 70 వేల రూపాయలు విలువ చేసే డెల్ కంపెనీ ల్యాప్ టాప్ అందజేశారు. జడ్.పి.హెచ్.ఎస్ సిరిపురం(కేజీ)లో 10వ తరగతి చదువుతున్న 20 మంది పేద విద్యార్థుల విద్యా అవసరాలకు 10,000 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ జీవితాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని, ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని, శ్రద్ధగా, క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. అనం తరం వేమూరు సత్యనారా యణను, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలు వా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాత వేమూరి సత్యనారా యణ, మార్పు స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకులు గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్ రావు, సోషల్ వర్కర్ షేక్ లతీఫ్, ఉపాధ్యాయులు సూర్యదేవర సురేష్, మూడు వసురామ్, విద్యార్థి కొత్తపల్లి ధనూష్ కుమార్ తల్లి కొత్తపల్లి సీత, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

## - నమోదు చేసిన వీఎం బంజర్ ఎస్ఐ కే.వెంకటేష్




**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**

వీఎం బంజర్ పోలీస్ స్టేషన్లో ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఖమ్మం కోర్టు ఆదేశాలతో వీఎం బంజర్ గ్రామానికి చెందిన పల్లపోతుల శ్రీనివాసరావు, పల్లపోతుల రామకృష్ణ, పల్లపోతుల వెంకటేశ్వరరావు అనే వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐకే వెంకటేష్ తెలిపారు. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం అనంతారం తండా కు చెందిన వాంకుడోత్ నరేష్ అనే వ్యక్తి 2014లో పెనుబల్లి గ్రామానికి చెందిన చీపు నరసింహారావు 23 కుంటలు భూమిని కొనుగోలు చేశారు. అట్టి భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి నరేష్ కొనుగోలు చేసిన 23 కుంటల భూమి మాదే అని పల్లపోతుల రామకృష్ణ, పల్లపోతుల శ్రీనివాసరావు, పల్లపోతుల వెంకటేశ్వర రావు అనేవారు అట్టి భూమి మీదకు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇట్టి విషయం బాధితుడు గౌరవ ఖమ్మం కోర్టుకి తెలుపడంతో కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నరేష్ కొనుగోలు చేసిన భూమి పెనుబల్లి ఎస్టీ ఏజెన్సీ షెడ్యూల్ ట్రైబల్ సంబంధించినదని కోర్టు వారి సూచన మేరకు నరేష్ ఫిర్యాదు తో ఎస్సీ, ఎస్టీ పలు సెక్షన్ల కింద ఎస్ ఐ కే. వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 15వ పోలీస్ పటాలములో పోలీస్ అమరవీరుల దినోత్సవం



**సత్తుపల్లి మేజర్ సూర్య న్యూస్:**

మండల పరిధిలోని 15 బెటాలియన్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరులకు బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు నివాళులు అర్పించారు. పోలీస్ సిబ్బంది స్మృతి పెరేడ్ నిర్వహించి పోలీస్ అమరవీరులకు గౌరవ వందనం తెలిపారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలు లోపించినప్పుడు వాటిని అదుపు చేయడానికి ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడే యోధుడు పోలీస్ అని అమరవీరుల స్మృతులను గుర్తు చేసుకుని వారికి నివాళులు అర్పించడం అభినందనీయమని అన్నారు. విద్రోహుల చేతి నుండి సమాజ రక్షణకు పోలీస్ ప్రతిక్షణం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఏ. అంజయ్య, అధికారులు, కానిస్టేబుల్స్, హెూంగార్డ్స్ పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలు పరిష్కార దిశగా యువ నాయకత్వం



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**

పెనుబల్లి మండలం సూరయ్య బంజర్ తండా గ్రామంలో స్థానిక యువ కాంగ్రెస్ నాయకులు కేలోతు సురేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామం లోని పలు ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలను చేపట్టారు. గ్రామంలో ప్రధాన నీటి నీటి సమస్యను పరిష్కరించారు. కొన్నిరోజులుగా పంచాయితీ మోటారు చెడిపోయి బోరు పంపులు పాడై గ్రామంలో నీటి సమస్య తలెత్తింది. పాత కొట్టుడు బోరు పంపులు మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తెచ్చారు. అలాగే పంచాయతీ మోటార్ ని కూడా మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామంలో కొందరి ఇళ్లకి నీరు అందకపోవడంతో వారికి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. అదే విధంగా గ్రామస్తులు సేద తీరేందుకు వాంకుడోత్ బాలాజీ, మురళి, కేలోతు గోపియా ల జ్ఞాపకార్థంగా సిమెంట్ బల్లలను ఏర్పాటు చేసారు. గ్రామ సమస్యలను పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న యువ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేలోతు సురేష్ నాయక్ ని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల జన్మదిన వేడుకలు



**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయం చైర్మన్ వెన్నపూసల సీతారాములు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తకొత్తూరు గ్రామంలో ఆయన నివాసంలో జరిగిన జన్మదిన వేడుకలలో పలువురు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజేశ్వరపురం సోసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ చిట్యాల రమేష్. పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకులు అడపాల రామారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు కడియాల నరేష్ తదితరులు చైర్మన్ కు శుభాకంక్షలు తెలిపారు.

# ఫైలేరియా నిర్మూలనే ఇంటింటి సర్వే లక్ష్యం..

## - మండల వైద్యాధికారి సాయికుమార్

**కూసుమంచి సూర్య మేజర్ న్యూస్:**

ఫైలేరియా వ్యాధి వ్యాప్తి పూర్తిగా ఆగిపోయిందో లేదో నిర్ధారించేందుకు చేపట్టిన ట్రాన్స్మిషన్ అసెస్మెంట్ సర్వే (టీఏఎస్ - 1) మంగళవారం కూసుమంచి మండలకేంద్రంలోని మైసమ్మ టెంపుల్ ఏరియాలో నిర్వహించారు. ఈ సర్వే ముఖ్య ఉద్దేశం ఫైలేరియా వ్యాధి వ్యాప్తి నిలిచిపోయిందని శాస్త్రీయంగా నిర్ధారించడం జరిగిందని తద్వారా ఫైలేరియా నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అనేక కార్యక్రమాలు వైద్యారోగ్య శాఖనుంచి అమలు చేస్తున్నామని మండల వైద్యాధికారి సాయికుమార్ అన్నారు. కూసుమంచి మండలకేంద్రంలో నిర్వహించిన సర్వే కార్యక్రమానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) పరిశీలకురాలు హారిక హాజరైనట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఫైలేరియా అనేది దోమల ద్వారా వ్యాపించే వ్యాధి. ఇది సాధారణంగా రాత్రి సమయాల్లో కుట్టే క్యూలెక్స్ దోమల ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. దీని కారణంగా మన శరీరంలోని లింప్ నాళాలు దెబ్బతిని, కాళ్లు లేదా చేతులు వాపు రావడం, "ఎలిఫెంటియాసిస్" అని పిలవబడే తీవ్ర స్థితి ఏర్పడుతుందన్నారు. ఈ వ్యాధిని దేశవ్యాప్తంగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం "ఫైలేరియా నిర్మూలన జాతీయ కార్యక్రమం"ను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఫైలేరియా వ్యాప్తి పూర్తిగా ఆగిపోయిందో లేదో నిర్ధారించడానికి ట్రాన్స్మిషన్ అసెస్మెంట్ సర్వే ను కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సిబ్బంది నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే 20 సంవత్సరాలు పైబడిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని, తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి మొత్తం 58 ఇళ్లను నమూనా ప్రకారం పరిశీలించినట్లు తెలిపారు. ప్రాథమిక స్క్రీనింగ్లో పాజిటివ్గా తేలిన వ్యక్తుల నుండి రాత్రివేళ రక్త నమూనాలు సేకరించి, మైక్రోఫైలేరియా లార్వా ఉందో..? లేదో..? పరీక్షిస్తారని తెలిపారు. పాజిటివ్గా తేలిన వారు తగిన చికిత్స, ఫాలో-



అప్ అందుకుంటారని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సాయికుమార్, డబ్ల్యూహెచ్వో పరిశీలకురాలు హారిక, సూపర్ వైజర్లు కొండలరావు, కిరణ్ కుమారు, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్కే ఫర్హత్ నాజ్, హెల్త్ అసిస్టెంట్ జీ రవిబాబు, ఏఎన్ఎం జీ ధనలక్ష్మి, ఆశాలు ఎన్ రజినీ కుమారి, కే మరియమ్మ, ఎన్ విజయకుమారి, కే రమాదేవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులను ఆదుకునేందుకు పటిష్ట కార్యాచరణ.....

## -రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి

## -తిరుమలయపాలెం మండలం గోల్ తండాలో ఏర్పాటు చేసిన సీసీఐ సెంటర్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**తిరుమలాయపాలెం, సూర్య మేజర్ న్యూస్ :-**





పత్తి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రివర్యులు, తిరుమలాయపాలెం మండలం గోల్ తండ గ్రామంలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు జి. లక్ష్మీ బాయి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వానాకాలం సీజన్ 2025లో మొట్టమొదటి సిసిఐ కేంద్రం పాలేరు నియోజకవర్గం తిరుమలయపాలెం మండలంలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత సీజన్ లో అతి భారీ వర్షాలు పడిన కారణంగా రైతులకు దిగుబడి తగ్గిపోయిందని అన్నారు. పత్తి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిసిఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. రైతులకు పత్తి పై మద్దతు ధర గిట్టుబాటు అవడం లేదని, దీనిపై పత్తి పంట మద్దతు ధర పెంచాలని రాబోయే పార్లమెంటు సెషన్ లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సమన్వయం చేసుకుంటూ పత్తికి మద్దతు ధర పెంచే విషయం చర్చను లేవదీసి, పత్తి మద్దతు ధర పెంపుకు కృషి చేస్తామని అన్నారు. తేమ పేరుతో రైతులను అనవసరంగా ఇబ్బందులు పెట్టాలని చూస్తే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి సిసిఐ కేంద్రం వద్ద వచ్చే అభ్యంతరాలను పరిష్కరించేందుకు స్థానిక వ్యవసాయ రెవెన్యూ, పోలీస్ అధికారులతో కమిటి ఏర్పాటు చేశామని అన్నారు. రైతులకు ఎవరైనా అన్యాయం చేయాలని చూస్తే స్థానిక కమిటీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రతి వ్యవసాయ అధికారి వద్ద తేమ యంత్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. రైతుల పొలాల వద్ద తేమ శాతం పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని, ఇంటి వద్దే ఆన్ లైన్ లో స్లాట్ బుకింగ్ ఎలా చేసుకోవాలి అనే దానిపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి వ్యవసాయ అధికారులకు సూచించారు. పత్తి రైతులకు నష్టం చేయాలని ఏ అధికారి ప్రయత్నించిన కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎలక్ట్రిసిటీ డి ఈ సిహెచ్ నాగేశ్వరరావు ఆత్మ కమిటీ చైర్మన్ శివరామకృష్ణ, డిసిసిబి డైరెక్టర్ బి. రాజశేఖర్, ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, తహసిల్దార్ లూథర్ విల్సన్, ఏవో నా రెడ్డి సీతారాంరెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ కార్యదర్శి పి వీరాంజనేయులు,మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నల్లమల్ల ప్రతాప్,నంద్యాల శ్యాంసుందర్ రెడ్డి, జడల నగేష్, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, బోడ మంగీలాల్ నాయక్, మిరియాల విక్రం రెడ్డి, నల్లబెల్లి లింగన్న, వెన్నం సుధాకర్ రెడ్డి, జడల రమేష్ లంజపల్లి శ్రీనివాస్, తురక వేణు, బానోతు వెంకన్న,బానోత్ వెంకన్న, చిప్పరపల్లి రమేష్ కట్టూరి శ్రీనివాస్ రెడ్డి మోరపాక నాగయ్య గుగ్గిళ్ళ సిరి గద్దె ఉపేందర్ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల బలోపేతానికి రైతులు అండగా ఉండాలి

## - సొసైటీ చైర్మన్ సాంబశివరావు.



**ఎర్రుపాలెం, సూర్య మేజర్ న్యూస్ :-**

సహకార సంఘాల బలోపేతానికి రైతులు అండగా ఉండాలని అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని అయ్యవారి గూడెం సహకార సంఘము పరిధిలోని45 మంది మందిరైతులకు సొసైటీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు మంగళవారం రుణాలను ఎర్రుపాలెంలోని కేంద్ర సహకార సంఘ బ్యాంకులో మేనేజర్ దివ్య తో కలసి అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ సాంబ శివరావు మాట్లాడుతూ అయ్యవారిగూడెం సహకార సంఘంలో 45 మంది రైతులకు గాను34 లక్షల 40 వేలరూపాయలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెనేజర్ దివ్య,అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్,క్యాషివేర్ మౌనిక,జానీ,సంఘం మాజీ అధ్యక్షులు శీలం నరసింహారావు,సీఈవో వీరారెడ్డి,ఎర్రుపాలెం సీఈవో శివారెడ్డి,సంఘ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసులు దాడి



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్ :-**

పేకాట స్థావరంపై వీఎం బంజర్ పోలీసులు కొరడా జలపించారు. వీఎంబంజర్ ఎస్ఐ కె. వెంకటేష్ తన సిబ్బందితో పేకాట స్థావరం పై దాడి చేసి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పెనుబల్లి మండలం బయ్యనగూడెం గ్రామంలో ఒక పాడుబడిన ఇంటిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేష్ పేకాట స్థావరంపై దాడి చేసి 9 మంది పేకాటరాయుళ్లను,రూ. 3 వేలు నగదుని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు

# వేమిరెడ్డి నారాయణరెడ్డి పార్థివ దేహానికి ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

**ఎర్రుపాలెం, సూర్య మేజర్ న్యూస్ :-**




మండల పరిధిలోని అయ్యవారి గూడెం గ్రామానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం గుండె పోటుతో మృతి చెందారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నారాయణ రెడ్డి పార్థివదేహానికి కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులుపార్టీ జెండాకప్పి,పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అరిపించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, డిసిసిబి డైరెక్టర్ ఐలూరు వెంకటేశ్వర రెడ్డి , మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా.రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, అనుమోలు. వెంకటకృష్ణా రావు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్ రెడ్డి, లక్కిరెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి,నర్సిరెడ్డి,యర్రమల శ్రీనివాస్ రెడ్డి, రాజీవ్ గాంధీ, వేమిరెడ్డి వెంకటరెడ్డి,బెజ్జం శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# భూసేకరణ సమస్యలను పరిష్కరించాలి...

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**-నవంబర్ నెలాఖరు లోపు ఎన్.హెచ్.ఏ.ఐ. కు భూ బదలాయింపు పూర్తి చేయాలి**
**-ఆర్బిట్రేషన్ ద్వారా రైతులకు మెరుగైన పరిహారం దక్కుతుంది**
**-జాతీయ రహదారి 163జీ పెండింగ్ భూ సేకరణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం (సూర్య బ్యూరో):**
జాతీయ రహదారి 163జి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారి 163జీ పెండింగ్ భూ సేకరణ అంశాలపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అమరావతి -నాగపూర్ జాతీయ రహదారి 163జీ క్రింద వైరా, బోనకల్, చింతకాని మండలంలో చెల్లింపులకు సంబంధించి ఉన్న పలు సమస్యలకు పరిష్కారం చూపించామని, ఇక్కడ భూ బదలాయింపు జరిగినందున పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. రఘునాథపాలెం మండలం వివి పాలెంలో 2.32 హెక్టార్ల భూ సేకరణ 3డీ గెజిట్ ప్రచురించి నవంబర్ చివరి నాటికి అవార్డు పాస్ చేసి భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివి పాలెం గ్రామంలో 9.98 హెక్టార్లకు సంబంధించి అవార్డు పాస్ చేశామని, వీరికి పరిహారం అందించి నవంబర్ 15 నాటికి ఈ భూమి జాతీయ రహదారి వారికి బదలాయించాలని అన్నారు. భూ సేకరణ



చట్టం ప్రకారం ఆర్బిట్రేషన్ పెంచే అవకాశం ఉందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించి భూ సేకరణ వేగవంతం చేయాలని అన్నారు. రైతులకు పరిహారం అందించే సమయంలో ఆ ప్రాంతంలో అత్యధికంగా జరిగిన రిజిస్ట్రేషన్ విలువ తీసుకో వాలని కలెక్టర్ తెలిపారు. చింతకాని మండలం వందనం గ్రామంలో పెండింగ్ స్ట్రక్చర్ పరిహారం చెల్లింపు వేగవంతం చేయాలని, ఆర్ అండ్ బీ, అటవీ శాఖ, హర్టీకల్చర్ విభాగాలు క్షేత్రస్థాయిలో వెంటనే పర్యటించి చెల్లించాల్సిన పరిహారం సంబంధించి నివేదిక తయారు చేయాలని అన్నారు. ఖమ్మం-విజయవాడ సంబంధించి ప్యాకేజీ 2 క్రింద ఎర్రుపాలెం మండలంలోని రెమిడిచెర్ల, ఎర్రుపాలెం, తక్కలపాడు గ్రామాలలో రీ-సర్వే ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, దీనిని ఖమ్మం ఆర్డీవో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వరంగల్ -ఖమ్మం ప్యాకేజీ 3



కి సంబంధించి ఖమ్మం రూరల్ మండలం తీర్దాల, రేగుల చలక, కామాంచికల్ గ్రామాలకు సంబంధించి బాధితులకు పరిహారం పంపిణీ పూర్తి చేసి సదరు భూమి జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించాలని అన్నారు. తీర్థాల, రేగులచలక, కామాంచికల్, మల్లెమడుగు, రఘునాథపాలెం గ్రామాలకు సంబంధించి కోర్టు స్టే జూన్ 10 న ముగిసిన నేపథ్యంలో పరిహారం సంబంధిత కోర్టులలో డిపాజిట్ చేసి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, ఈ ప్రక్రియ అక్టోబర్ నెలాఖరు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం జిల్లా పరిధిలో ఎన్.హెచ్. 365 ఏ, బీ, 563 జి సంబంధించి బ్లాక్ స్పాట్స్ గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. బైపాస్ రోడ్డు మీద వచ్చిన క్రాక్స్, గుంతలు పూడ్చి వేయాలని అన్నారు. బైపాస్ సెక్షన్ లను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించని పక్షంలో వన్ టైం ఇంప్రూవ్ మెంట్ పనులు చేపట్టాలని కలెక్టర్ ఎన్.హెచ్. అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే పి.డి. దివ్య, తహసీల్దార్లు, కలెక్టరేట్ భూ సేకరణ విభాగం సెక్షన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పాలేరు అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి : మంత్రి పొంగులేటి

**- డిసెంబర్ చివరిలోపు కూసుమంచి జూనియర్ కళాశాల నిర్మాణం పూర్తికి ఆదేశం**
**- ఖమ్మం జిల్లా ఆసుపత్రికి నెఫ్రాలజీ, యూరాలజీ వైద్యులు అవసరం**

**కూసుమంచి : సూర్య (మేజర్ న్యూస్)**



పాలేరు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం, నాణ్యత ముఖ్యం అని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆర్%డ%బీ, పంచాయతీ రాజ్, విద్యా శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించి, దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ నాటికి కళాశాల అందుబాటులోకి కూసుమంచి మండలంలో నిర్మాణంలో ఉన్న జూనియర్ కళాశాల భవన పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డిసెంబర్ చివరి వరకు నూతన భవనాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంచేశారు.

### సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామకంపై దృష్టి

ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ముఖ్యంగా, నెఫ్రాలజీ (మూత్రపిండాల వైద్యం), యూరాలజీ వంటి కీలక విభాగాలకు సంబంధించి అనుభవం ఉన్న వైద్యులను వెంటనే జిల్లా ఆసుపత్రికి కేటాయించాలని డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)ను ఆయన చరవాణి ద్వారా సంప్రదించి కోరారు.

### ఆరోగ్య కేంద్రాల భవనాలపైనా సమీక్ష

తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల పరిధిలో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) భవన నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. తిరుమలాయపాలెంలో రూ. 25 కోట్లతో చేపట్టనున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తైందని, పనులను త్వరలో క్షేత్ర స్థాయిలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

### ఆర్-బీ పనులు వేగవంతం

పాలేరు నియోజకవర్గంలో జరుగుతున్న ఆర్%డ%బీ (రోడ్లు, భవనాలు) శాఖ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, అన్ని పనులూ నాణ్యతతో, సమాంతరంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సమీక్షా కార్యక్రమంలో ఆర్-బీ ఎస్ఈ యాకుబ్, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు తదితర అధికారులు పాల్గొన్నారు.




## నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..

**-రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**-నర్సింగ్ కళాశాల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మంత్రి పొంగులేటి**







**ఖమ్మం (సూర్య బ్యూరో):**
ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి లో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి మంగళవారం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, 25 కోట్ల రూపాయల వ్యయంతో పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 24.70 కోట్ల వ్యయంతో సివిల్ పనులు, 30 లక్షలతో పరికరాలను చేపట్టామన్నారు. కళాశాల బ్లాక్ ను జిం2 లో 3 ఫ్లోర్ లలో, హాస్టల్ బ్లాక్ ను జిం3 నాలుగు ఫ్లోర్ లలో నిర్మాణం చేపట్టామన్నారు. హాస్టల్ భవన నిర్మాణం పనులు తుది దశలో ఉండగా, కళాశాల నిర్మాణ పనులకు సంబంధించి టైల్స్, సానిటరీ, వాల్ పుట్టి పనులు పురోగతిలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. చేపట్టాల్సిన పనుల విషయమై మంత్రి, అధికారులకు పలు సూచనలు చేశారు. మిగులు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి, భవనాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కళాశాల ప్రిన్సిపాల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.